కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం కాప్రా కాంప్లెక్స్, ఓల్డ్‌బోయిగూడలో ఏర్పాటు చేసిన క్రాసింగ్ మీటింగ్‌లలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో దేశాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లిందన్నారు. హైదరాబాద్ జంటనగరాల్లోని పలు రైల్వే స్టేషన్లను సుమారు రూ. 2500 కోట్ల వ్యయంతో ఆధునికీకరిస్తున్నట్లు వివరించారు. సికింద్రాబాద్, నాంపల్లి, చర్లపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లలో పనులు చురుకుగా సాగుతున్నాయని రూ. 720కోట్లతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇక్కడి పనులు పూర్తయితే శంషాబాద్ ఎయిర్‌పోర్టును తలపించేలా ఉంటాయన్నారు. కాంగ్రెస్ పాలనలో అనేక అవినీతి, కుంభకోణాలు చూశారని, నరేంద్రమోదీ హయాంలో ధర్మపాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, నాయకులు శ్యాం సుందర్ గౌడ్, పెద్ది రవీందర్, శ్రీశైలం గౌడ్, ఎస్. ఆర్ మల్లేష్, అశ్విని, బన్సల్, నివాస్, అనీష్ వర్మ, దయారావు పాల్గొన్నారు.

అన్నార్తుల ఆకలి తీర్చడం స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆహ్వానించిన సభ్యులు

సనత్‌నగర్: మండు వేసవిలో అన్నార్తుల ఆకలి తీర్చడంతో పాటు సంవత్సరం పొడవునా పేద ప్రజల కోసం శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో వయస్సును సైతం లెక్క చేయకుండా ప్రతియేటా వేసవి కాలంలో మధ్యాహ్న మిత భోజన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఎప్పటి లాగానే బీకేగూడ పార్కు వద్ద ఉచిత భోజన పంపిణీ కార్యక్రమంతో పాటు చలివేంద్రం కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉచిత భోజన కార్యక్రమం చేపట్టి రెండు నెలలకు పైగా కొనసాగించి అనేక మంది ఆకలి తీరుస్తుండటంఅభినందనీయమన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మేనేజింగ్ ట్రస్టీ పార్థసారధి, సభ్యులు కృష్ణారెడ్డి, కృష్ణదేవ్‌గౌడ్, అరవింద్‌గౌడ్ ఉన్నారు.


- అన్నదానం చేసేందుకు దాతలు పోటీ పడుతుంటారు. ఒక్కో రోజు ఇద్దరు ముగ్గురు సైతం ముందుకు వస్తుంటారు. అయితే ఆ రోజుల్లో మిత భోజనం కార్యక్రమం కాస్తా విందు భోజనం అవుతుంది. అయితే ఈ ఏడాది నుంచి అలా కాకుండా ఒకరోజు ఒక దాతకే కేటాయించి ఎక్కువ రోజులు మితభోజన పథకాన్ని నిర్వహిస్తే బాగుంటుందని, తద్వారా దాతలందరినీ సంతృప్తిపరిచే దిశగా ట్రస్ట్ ఆలోచన చేస్తోంది. రోజుకు 250 మందికి కోసం మిత భోజనాన్ని అందించేందుకు దాతల నుంచి రూ.5 వేలు తీసుకుంటున్నారు.

యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా హరిశంకర్


హరిశంకర్‌ను సన్మానిస్తున్న ఏబీవీపీ నాయకులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ పీజీ కళాశాలలో హిస్టరీ విభాగం అధ్యాపకులు డాక్టర్ హరిశంకర్ యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఇటీవల నియమితులయ్యారు. సందర్భంగా పీజీ కళాశాల ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాలు ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం కళాశాల ఆడిటోరియంలో హరిశంకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ.. పాఠ్యాంశాలు అర్థమయ్యే రీతిలో బోధిస్తూనే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు గుర్తించి వారిని మంచి నాయకులుగా తీర్చిదిద్ది ఈ సమాజానికి అందించడంలో హరిశంకర్ పాత్ర కీలకమన్నారు. నిరంతరం విద్యార్థి పరిషత్‌తో ముడిపడి ఉంటూ వారి విలువైన సమయాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కిషోర్, నాగరాజు, పాండురంగ్, రాజు. రవితేజ, అభిలాష్, శివశంకర్ పాల్గొన్నారు.

టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించేందుకు వినతి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: టెట్ అర్హత పరీక్ష ఫీజు తగ్గించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం సమర్పించారు. బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రిని కలిసి పెంచిన ఫీజుల గురించి వివరించినట్లు తెలిపారు. గతంలో ఒక్క పేపర్‌కు రూ. 200 కాగా పెరిగిన ఫీజు రూ.1000, రెండు పేపర్లు రాసే అభ్యర్థులకు రూ.300 నుంచి రూ.2000 పెంచారని మంత్రికి వివరించారు. నిరుద్యోగంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అభ్యర్థులు రూ. వేలల్లో ఫీజు చెల్లించలేని దుస్థితిలో ఉన్నారన్నారు. స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి టెట్ ఫీజు తగ్గించాలని ఆదేశించినట్లు తెలిపారు. సురేష్, రాజేందర్, పండరి, బద్రీ, రాజశేఖర్, మహేష్, పవన్, కిరణ్, సంతోష్ ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేస్తాం


పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

లాలాపేట: సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో బుధవారం వినోభానగర్ కమ్యూనిటీ హాల్లో జరిగిన జనజాగరణ కార్యక్రమంలో అఖిల భారత సామాజిక సమరసత వేదిక కన్వీనర్ శ్యాం ప్రసాద్ పాల్గొని భరతమాత, స్వామి వివేకానందుడు, డా. అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు, ఆదర్శాలను నెరవేర్చాలనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సేవలను అందరూ గౌరవించాలన్నారు. అనంతరం 25 మంది పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు, స్వీట్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, రాఘవేంద్ర నాయక్, చిరంజీవి, కోటేశ్వర్ రావు, శ్రవణ్, భరత్, కిరణ్‌గౌడ్, ప్రసాద్, స్వామి పాల్గొన్నారు.

బోరబండలో గంజాయి విక్రేత అరెస్టు


పోలీసుల అదుపులో గంజాయి విక్రేత

అమీర్‌పేట/రహమత్‌నగర్ : గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని అమీర్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ సత్యనారాయణ సమాచారం మేరకు... బుధవారం బోరబండ బస్ స్టాప్ తమ సిబ్బంది రూట్ వాచ్ నిర్వ హిస్తుండగా మధ్య ప్రదేశ్‌కు చెందిన ప్రహ్లాద్‌గుప్తా అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో సోదా చేయగా అతని వద్ద 5 కేజీల ఎండు గంజాయి లభించింది. గంజాయితో పాటు మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రహ్లాద్‌గుప్తాను రిమాండ్‌కు తలరించామని ఎక్సైజ్ ఎస్‌ఐ పేర్కొన్నారు. హెడ్ కానిస్టేబుల్ మాధవరెడ్డి, గోపాల్ తదితరులు దాడుల్లో పాల్గొన్నారు.

జాడలేని ఇంకుడు గుంతలు!

- అవగాహన అంతంత మాత్రమే
- నీటి దినోత్సవానికే కార్యక్రమాలు పరిమితం
- భారీ భవంతుల్లోనూ కనిపించని ఇంకుడు గుంతలు
- పట్టించుకోని లష్కర్ అధికారులు



నీటి దినోత్సవం రోజు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)

సికింద్రాబాద్: భూగర్భ జలాల పరిరక్షణ కోసం సికింద్రాబాద్ ప్రాంతంలో తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. వర్షాకాలానికి ముందే విస్తృతంగా నిర్వహించాల్సిన ఇంకుడు గుంతల ఏర్పాటు ప్రక్రియ ఈ ప్రాంతంలో ప్రపంచ నీటి దినోత్సవానికి మాత్రమే పరిమితమైంది. గడచిన ఆరేళ్లగా ఇంకుడు గుంతల ఏర్పాటు విషయంలో ఇదే తంతు కొనసాగుతుంది. రెండేళ్ల క్రితం వరకు ఓ మోస్తరు కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు క్రమేణా ఇంకుడు గుంతల ఏర్పాటు, అవగాహన కార్యక్రమాల నిర్వహణను ఒకటి రెండు రోజులకు మాత్రమే పరిమితం చేశారు. తొలుత జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు వేర్వేరుగా క్రమేణా ఇరు విభాగాల అధికారులు సమన్వయంతో ఇంకుడు గుంతల ఏర్పాటు ప్రక్రియను నిర్వహించేవారు. గరిష్ఠంగా ఒక్కో మున్సిపల్ డివిజన్‌కు 50 వరకు ఇంకుడు గుంతలను అధికారులు ఏర్పాటు చేసేవారు. వరదనీటి నిల్వలు ఉండే ప్రాంతాలు, పార్కులు, రహదారులను ఆవరించి ఉన్న లోతట్టు ప్రాంతాలను ఎంపిక చేసి అటు జీహెచ్‌ఎంసీ ఇటు జలమండలి అధికారులు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేవారు. ఆపై కాలనీ ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వ్యక్తిగత గృహాల ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేందుకు సహకారం అందించేవారు.

కనుమరుగు..

కొత్త ఇంకుడు గుంతల ఏర్పాటు విషయంలో ప్రత్యేక కార్యక్రమాలు లేకపోగా.. గతంలో నిర్మించిన ఇంకుడు గుంతల ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఇరు విభాగాల ప్రభుత్వ అధికారులు నిర్మించిన ఇంకుడు గుంతలపై పర్యవేక్షణ పూర్తిగా కరువైంది. కొన్ని గుంతలు వరద మట్టితో పూడుకుపోగా, మరికొన్ని నిర్మాణాలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఇదిలా ఉండగా కొత్తగా నిర్మించే గృహ యజమానులకు ఇంకుడు గుంతల ఏర్పాటు గురించి అవగాహన కల్పించడం, నిర్మించే సమయంలో సహకారం అందించేవారు కరువయ్యారు. 300 గజాలు దాటిన స్థలంలో భవన నిర్మాణం చేపడితే ఆ భవన ప్రాంగణంలో పక్కాగా ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలని చట్టం చెబుతుంది. సికింద్రాబాద్ ప్రాంతంలో 300 గజాల చదరపు గజాలు దాటిన స్థలాల్లో లెక్కకు మించిన భవన నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ ఎక్కడా ఇంకుడు గుంతల ఏర్పాటు జరగకపోవడం గమనార్హం.

చర్యలు శూన్యం..

300 గజాలకు మించిన వైశాల్యం కలిగిన స్థలాల్లో స్థలాల్లో అనుమతికి మించిన అంతస్తుల నిర్మాణం జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు ఇక ఇంకుడు గుంతల వ్యవహారాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోని గృహ యజమానులపై చర్యలు తీసుకునే చట్టాలు ఉన్నాయి. సదరు భవనాలను గుర్తించి గుంతల ఏర్పాటు కోసం నోటీసు జారీ చేయాలి. యజమాని నుంచి స్పందన రాకపోతే వాటర్, విద్యుత్ కనెక్షన్ తొలగించే అధికారం జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు ఉన్నాయి. ఈ తరహా చర్యలకు మంగళం పాడిన అధికారులు ప్రపంచ నీటి దినోత్సవం రోజు నామమాత్రపు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వివరాలు సేకరిస్తున్నాం..



ఇంకుడు గుంతల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇందుకు సంబంధించిన వివరాలు సేకరించే పని ప్రారంభించాం. ప్రాంతాల వారీగా తమ సిబ్బంది ఇంటింటి పర్యటనలు చేసి ఇంకుడు గుంతల వివరాలు సేకరిస్తున్నారు. సదరు ఇంటి నల్లా, విద్యుత్ కనెక్షన్లు, ప్రాపర్టీ ట్యాక్సు నెంబర్లను సేకరిస్తున్నారు. ఇంకుడు గుంతలు లేనివారిని నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటాం.

–రవికిరణ్, జీహెచ్‌ఎంసీ జెడ్సీ

ఏర్పాటుకు సహకారం అందిస్తాం



ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు సమీపంలోని జలమండలి సెక్షన్ కార్యాలయాల్లో లేదా నేరుగా మారేడుపల్లిలోని డివిజనల్ కార్యాలయంలో సంప్రదించాలి. నిర్మించుకునే పద్ధతులను వివరించేందుకు సాంకేతిక పరమైన సహకారాన్ని జలమండలి సిబ్బంది అందిస్తారు. 300 గజాల గృహ నిర్మాణదారులు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి లేనిపక్షంలో తాగునీటి కనెక్షన్‌ను రద్దు చేస్తాం.

–వై.కృష్ణ, జలమండలి డీజీఎం

నేటి నుంచి హునార్ మహోత్సవ్ ఎక్స్‌పో

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో నేటి (గురువారం) నుంచి వచ్చే నెల ఏప్రిల్ 8 వరకు హునార్ మహోత్సవ్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. దేశంలోని 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 3 వందల మంది కళాకారులు రూపొందించిన చెక్క మట్టిబొమ్మలు అజ్రాఖ్ బ్లాక్ ప్రింట్లు ఇతర కళాఖండాలు, జనపనారా, చెరకు మరియు ఇత్తడి చేతితో తయారు చేసిన ఉత్పత్తులు, లక్క గాజులు, రాజస్థానీ నగలు, తోలు ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు వివిధ రాష్ట్రాల వంటకాలు, వివిధ సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ దర్శనం ఉంటాయని పేర్కొన్నారు.

జై స్వరాజ్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా థామస్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి జై స్వరాజ్ పార్టీ నుంచి ఎస్‌జే థామస్‌ను అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాస్‌రావు ప్రకటించారు. కాసాని శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. హ్యూమన్ రైట్స్ కమిషన్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న ఎస్‌జే థామస్ సామాజిక సేవలను పరిగణలోకి తీసుకుని ఆయనకు సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశామన్నారు. ఎస్‌జే థామస్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పేద మధ్యతరగతి ప్రజలకు న్యాయం జరగడం లేదని పేదలకు సేవ చేయాలన్న లక్ష్యంతోనే జై స్వరాజ్ పార్టీలో చేరి ఎంపీగా పోటీ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఆధారాలు లేని డబ్బు స్వాధీనం

అమీర్‌పేట: సరైన ఆధారాలు లేని డబ్బును ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేరళకు చెందిన ఎం.షాదిల్ బంజారాహిల్స్ జహీరానగర్‌లో ఉంటూ కార్ల వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఎస్‌ఆర్‌నగర్‌లోని ఏటీఎం సెంటర్‌లో డబ్బులు డిపాజిట్ చేసేందుకు వచ్చాడు.బ్యాగులో ఎక్కువగా డబ్బులు కనిపించడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు షాదిల్‌ను అదుపులోకి తీసుకున్నారు.ద్విచక్ర వాహనంలోని బ్యాగులో ఉన్న రూ.1.30 లక్షల నగదును స్వాధీనం చేసుకుని విచారించగా జహీరానగర్‌లో ఉండే మరో ఇద్దరు స్నేహితులు వద్ద డబ్బులు ఉన్నట్లు చెప్పడంతో అక్కడికి వెళ్లి రూ.11.70 లక్షలతో పాటు ఏసీ మెకానిక్ యిజాజ్, ఎం.ఫజల్‌ను అరెస్టు చేశారు. డబ్బులకు సంబంధించి సరైన సమాధానం ఇవ్వక పోవడంతో హవాలా డబ్బుగా నిర్ధారించారు.డబ్బులు ఎక్కడి నుండి తెచ్చారన్న దానిపై విచారణ జరుపుతున్నామని గతంలో ఇదే తరహా షాదీల్ వద్ద రూ. కోటి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ హోంగార్డు బైక్ చోరీ

అమీర్‌పేట: ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద పార్క్ చేసిన ట్రాఫిక్ హోంగార్డు ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీడిమెట్లలో నివాసముంటున్న మహబూబ్ సుభాని ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్నాడు. 24వ తేదీన డ్యూటీకి వచ్చి తన బజాజ్ పల్సర్ వాహనాన్ని స్టేషన్ వద్దే పార్కింగ్ చేశాడు.మరొసటి రోజు డ్యూటీ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లేందుకు వాహనం కోసం చూడగా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేశాడు.

ఓయూలో తగ్గుతున్న విదేశీ విద్యార్థుల ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విదేశీ విద్యార్థుల ప్రవేశాల సంఖ్య ప్రతి ఏటా తగ్గుతుంది. గతంలో విదేశీ విద్యార్థులు నాలుగు వేలు ఉండగా నేడు కేవలం 140 మంది మాత్రమే ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి క్రమేణ తగ్గుముఖం పట్టిన విద్యార్థుల సంఖ్య కరోనా అనంతరం పూర్తిగా పడిపోయింది. అఫ్ఘన్ యుద్ధం కొత్త ప్రభుత్వం అధికారం చేట్టిన వెంటనే నూతన పాలన విధానంలోని ఆంక్షలతో విద్యార్థులు ఓయూకు రావడం మానేశారు. విదేశీ విద్యార్థుల కోసం హాస్టల్‌తో పాటు అనేక వసతులు కల్పించినా వివిధ కారణాలతో ఓయూలో చదివేందుకు ఆసక్తి చూపడం లేదు. పైగా రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా ప్రవేటు వర్సిటీలు విస్తరించడంతో విదేశీ విద్యార్థులు అక్కడ చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని ఓ యూ అధికారులు పేర్కొన్నారు. విదేశీ విద్యా ర్థుల ప్రవేశాలకు ప్రత్యేకంగా వెలిసిన ప్రైవే టు ఏజెన్సీలు, ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రైవేటు వర్సిటీలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. భవిష్యత్తులో విదేశీ విద్యార్థుల సంఖ్య పూర్తిగా నిలిచిపోవచ్చని ఓయూ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా విదేశీ విద్యార్థుల ప్రవేశాలతో గతంలో ఓయూకు ప్రతి ఏటా రూ. 15 నుంచి రూ.20 కోట్ల లోపు ఆదాయం వస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఇంకుడు గుంతల ఏర్పాటు తప్పనిసరి


తార్నాక చింతల్‌లో ఇంకుడు గుంతను పునఃనిర్మాణం చేస్తున్న దృశ్యం

లాలాపేట: జలమండలి భద్రతా పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా తార్నాక జలమండలి సహకారంతో గాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం తార్నాక చింతల్ బస్తీలో ఇంకుడు గుంతను పునః నిర్మాణం చేశారు. నీటి పొదుపు, ప్రాధాన్యం, ఆవశ్యకత, నీటిని ఎలా సంరక్షించుకోవాలి అనే అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. తార్నాక జలమండలి డీజీఎం సరిత మాట్లాడుతూ.. మానవ మనుగడకు జీవనాధారమైన నీటిని పొదుపు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటుతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. గాయత్రి ఫౌండేషన్ సీఈఓ రవి మాట్లాడుతూ వరల్డ్ వాటర్ డేను పురస్కరించుకుని ఈ నెల 22 నుంచి 28 వరకు శాంతి కోసం నీరు అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దీంతో పాటుగా వీలైన చోట్ల ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంలు నిఖిత, కృష్ణప్రసాద్, సిబ్బంది పాపారావు, గాయత్రి ఫౌండేషన్ రవి, ప్రతినిధులు ప్రణయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మారావును గెలిపించుకుంటాం


పద్మారావును కలిసిన నాయకులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి టీ.పద్మారావుకు పలువురు నేతలు బుధవారం తమ మద్దతు ప్రకటించారు. ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రుద్రవరం సునీల్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పద్మారావు నివాసానికి వచ్చి తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ.. ఇటీవల బీఎస్పీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు అందరూ పద్మారావును పార్లమెంట్ సభ్యుడిగా భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. కేఎల్ సత్యనారాయణ, పి.జగన్, రవితేజ, రఘు, ఆశ, పరమేష్, రహీంఖాన్, శివలింగం, హుస్సేన్ పాల్గొన్నారు.

ఓయూలో ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొ.లింబాద్రి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ పోటీలు ప్రారంభమయ్యాయి. బుధవారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహద పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, కవి మామిడి హరికృష్ణ, అధ్యాపకులు రామస్వామి, రామకృష్ణ, నిర్మల, మానస, రవి పాల్గొన్నారు.

కుమ్మర్లకు బీఎస్పీ నుంచి ఎంపీ టికెట్ కేటాయించాలి


మంద ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

లాలాపేట: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలోని కుమ్మర్లకు ఎంపీగా పోటీ చేసేందుకు బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) నుంచి అవకాశం కల్పించాలని కుమ్మరి కులస్తుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు దునుకు వేలాద్రి కోరారు. బుధవారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్, తెలంగాణ కోఆర్డినేటర్ బాలయ్యను ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ తమ వర్గాలకు అవకాశం కల్పించకపోడంతో దేశ రాజకీయాల్లో కుమ్మర్లు చాలా వెనుకబడి ఉన్నారన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో దాదాపు 80 వేల మంది కుమ్మరి కులం ఓటర్లు ఉన్నారన్నారు. కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన నాయకుడు తెలంగాణ కుమ్మరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వీరభోగ వసంతరాయలు ప్రజాపతికి మల్కాజిగిరి, భువనగిరి, నల్గొండ స్థానాల్లో ఏదో ఒక స్థానం నుంచి టికెట్ కేటాయించాలన్నారు.

అర్హులందరికీ 'ఆరు గ్యారంటీ'లు


ప్రచారంలో పాల్గొన్న శ్రీగణేష్

రసూల్‌పురా: ఎంపీ ఎన్నికలతో పాటు జరగనున్న కంటోన్మెంట్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటేయాలని ఆ పార్టీ నాయకులు శ్రీ గణేష్ కోరారు. మంగళవారం రాత్రి కంటోన్మెంట్ నియోజకవర్గం తిరుమలగిరి సెంట్రల్ బక్రి కాలనీలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పేదల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్న రేవంత్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అర్హులైన పేదవారికి ఆరు గ్యారంటీ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రంగా రవీందర్, రేమాండ్ హర్యాడ్, శ్యామ్, అజయ్‌రాజ్, శ్రీనివాస్, అభిజిత్, నిర్మల, పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో కేటీఆర్




రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా 313 గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం గన్‌బజార్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి కేటీఆర్, మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నారాయణ జోపిడి సంఘం బస్తీవాసులు కేటీఆర్‌ను కలిసి త్వరగా డబుల్ బెడ్రూమ్ పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరగా అధికారులతో మాట్లాడి పనులు జరిగేలా చూస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేటీఆర్ వెంట మన్నె క్రిశాంక్, నివేదిత, గజ్జెల నాగేష్, ఎర్రోళ్ళశ్రీనివాస్, ఎన్. శ్రీనివాస్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి


జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

లాలాపేట: ప్రకాశం ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం సంస్థ చైర్మన్ డా. పి. మోహన్‌రావు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని అందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. సంస్థ సెక్రటరీ శ్రీరామ్, రాజశేఖర్, విద్యాసాగర్‌రెడ్డి, నిరంజన్ దేశాయి, ప్రాధానోపాధ్యాయురాలు రమాదేవి పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



సనత్‌నగర్: హనుమాన్ దేవాలయ ప్రాంగణంలోని వివిధ ఆలయాల హుండీలను బుధవారం లెక్కించారు. ఆలయాల్లోని 20 హుండీల ద్వారా 50 రోజులకు రూ.3,21,865 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, ఆలయ ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రవీంద్రాచార్యులు, రిపుంజయశర్మ, సుదర్శనాచార్యులు, గోపాల్‌జోషిలతో పాటు సిబ్బంది శివ, కాటం శ్రీనివాస్‌గౌడ్ ప్రసాద్, శివ పాల్గొన్నారు.